ప్రేమలో నిజాయితీని వాళ్లెలా గుర్తించారు?

# ప్రేమ

అల్లూరి గౌరీలక్ష్మి కథ

పార్క్‌లో కిరణ్‌కోసం ఎదురుచూస్తోంది ఉష. కిరణ్‌కి చెప్పాల్సిన విషయాలు మననం చేసుకుంటోంది. కిరణ్, ఉష పక్కింట్లో అద్దెకి వుంటున్నాడు. ఇంజనీరింగ్ ఫైనల్ చదువుతున్నాడు. వాళ్లిద్దరికీ పరిచయమై కొద్దిరోజులే అయినా ఒకరిని చూడకుండా ఒకరు వుండలేరు ఒక్కరోజుకూడా! అంతటి అనుబంధం పెనవేసుకుంది వారిమధ్య. అదే ప్రేమ మహిమేమో!

తెల్లగా బొద్దుగా, ముద్దుగా వుండే ఉషను చూసి తనకిలాంటి భార్యే కావాలనుకున్నాడు కిరణ్. ఇంజనీర్ కాబోతున్న కిరణ్‌ను చూసి తనకిటువంటి భర్తే కావాలనుకుంది ఉష. ఇద్దరి మనసులూ కలిశాయి. కాలం చకచకా దొర్లిపోతోంది. వారానికొకసారి కలుసుకోవడం, ప్రతిరోజూ కిటికీలోంచి చూసుకోవడం వారి దినచర్య.

తనకన్నా ముందుగా వచ్చి వెయిట్ చేస్తున్న ఉషను చూడగానే కిరణ్ ప్రేమగా ''సారీ ఉషా! పది నిమిషాలు లేటయ్యింది'' అన్నాడు పక్కనే కూర్చుంటూ.

''ఇట్సోకే'' అంది ఉష చిన్నగా నవ్వుతూ.

''ఎంతఅందంగా వున్నావో తెలుసా ఉషా! కావాలంటే నా కనుపాపల్లో చూసుకో'' అన్న కిరణ్ మాటలకి సిగ్గులమొగ్గే అయింది ఉష.

మెల్లగా కాలేజీ విశేషాలూ, సినిమాలూ చర్చల్లో పడ్డారు. హఠాత్తుగా ''అదేంటో ఉషా! నేనేపని చేస్తున్నా నా మనసులో నువ్వే వుంటావ్. ఒక్క క్షణం వదలకుండా ఆ భావమే నాకెంతో గర్వంగా అనిపిస్తుంది



మరి నీకు?'' అడిగాడు కిరణ్.

"నాక్కూడా అంతే కిరణ్! అమ్మ ఊరికి రమ్మంటోంది కానీ నేను వెళ్లను. ఏదో వంకపెట్టి మానేస్తాను. నిన్ను చూడకుండా ఒక్కరోజుండలేను'' ఉష కళ్లలో నీళ్లు! ఆ ఆప్యాయతకి కిరణ్‌కి కళ్లుచెమ్మగిల్లాయి.

"ఇంక బయలుదేరదామా'' అడిగింది ఉష.

"నువ్వెప్పుడూ నవ్వుతూ వుండాలి.

ఇలా వుంటే నేను చూడలేను" బేలగా అన్నాడు కిరణ్.

"అలాగే! నీకోసం వస్తూ వుంటాను సరేనా!" రిలాక్సవుతూ అంది ఉష. ఇద్దరూ లేచారు.

◇ ◆ ◇

కిరణ్ కి ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. "ఎగ్జామ్స్ కాగానే వెళ్లిపోతావా?" దిగులుగా అంది ఉష ఒకరోజు.

"పిచ్చిపిల్లా! ఒక్క వారంలో వచ్చేస్తా. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ అని చెప్పి నీ కళ్లెదురుగానే వుంటాను. నేనుమాత్రం నిన్ను చూడకుండా వుండగలనా!" లాలించాడు కిరణ్.

ఎగ్జామ్స్ పూర్తయ్యాయి. నేను వెళ్లేది మన పెళ్లి విషయం ఇంట్లో చెప్పడానికే. నువ్వేం దిగులుపడకు. వన్ వీక్‌లో ఇక్కడ వుంటా"

ఉషకి ధైర్యంచెప్పి బయలుదేరాడు కిరణ్.

"మర్నాటినుండి లెటర్‌కోసం ఎదురుచూసింది ఉష. పదిరోజులైంది. నో రిప్లై! ఉక్రోషం ముంచుకొచ్చింది ఉషకి. నెలరోజులతరువాత కిరణ్ వచ్చాడన్నవార్త వినగానే ఆగలేక అతని రూమ్‌కి పరుగెత్తింది. లోపల అడుగుపెడుతూనే ఆశ్చర్యపడింది. రూమ్ ఖాళీ చేస్తున్నాడు కిరణ్.

ఉషని చూస్తూనే 'హలో!' అన్నాడు ముక్తసరిగా. ఆ కళ్లలో మెరుపు లేదు. ఉష మనసు కీడుని శంకించింది.

"ఎప్పుడొచ్చావ్?" ఉషే అడిగింది. 'ఇప్పుడే' అన్నాడు కిరణ్.

"మీ అమ్మా నాన్నా బావున్నారా?" తల ఊపాడు ఉష ప్రశ్నకి.

"మన పెళ్లి విషయం చెప్పావా? ఏమన్నారు?" గుండె చిక్కబట్టుకుని అంది.

తన పర్సుల్లు ఆ పేపి కుర్చీలో కూర్చున్నాడు. ఉష కిటికీకి జారబడింది. "ఉషా! అయామ్ సో సారీ! నువ్వేం కంగారుపడకు. మన పెళ్లికి మావాళ్లు ఒప్పుకోలేదు. రెండు లక్షల కట్నంతో మరో సంబంధం సెటిల్ చేసేశారు. మన పెళ్లి జరిగితే మా అమ్మానాన్నా "మేం బతకం" అన్నారు. బలవంతంగా ఈ పెళ్లికి ఒప్పుకోవలసివచ్చింది. నన్నపార్థం చేసుకోకు. ప్లీజ్ ట్రైటు అండర్‌స్టాండ్ మై ప్రాబ్లమ్!" కిరణ్ చెబుతున్నాడు.

తన అనుమానం నిజం కాగానే ఉషకి మెదడు మొద్దుబారింది.. దుఃఖం ముంచుకొచ్చింది. అంతలోనే తమాయించుకుంది. సూటిగా అడిగింది.

"అయితే నువ్వు మన ప్రేమ ఫెయిలైనందుకు బాధపడట్లేదా?"

"చాలా బాధపడ్డాను ఉషా! ఈ నెలమంచి మదనపడుతూనే వున్నాను. ఇప్పుడిప్పుడే కాస్త ధైర్యం వస్తోంది" అన్నాడు విపత్తుమంచి తప్పించుకున్నవాడిలా. మళ్లీ తనే అన్నాడు "లైఫీజ్ వెరీ షార్ట్ ఉషా! ప్రేమకోసం బెంగపడి జీవితాన్ని పాడుచేసుకునేకంటే పరిస్థితులకు అడ్జస్ట్ అయి సుఖపడడమే మంచిది ఉషా! మనం అనుకున్నవన్నీ జరుగవు. నువ్వు కూడా నన్ను మర్చిపోయి నీకు నచ్చినవాడిని చేసుకోవాలని నా కోరిక" కిరణ్ మాటలు నెలరోజుల అంతరంగమధనంనుండి వచ్చిన మాటల్లా కాక సమయానికి తగిన మెట్టవేదాంతం చెబుతున్న మాటల్లా స్పష్టంగా అర్థమయ్యాయి ఉషకి.

"థాంక్స్ ఫర్ యువర్ అడ్వైస్. నువ్వీ లేపికబుర్లు మానేసి కట్నంకోసం ఇంకో అమ్మాయిని చేసుకుంటున్నాను. నిన్ను సరదాగా ప్రేమించాను అనుంటే ఇంకా సంతోషించేదాన్ని. నీకాధైర్యంకూడా లేదు. ఐ హేట్‌యూ! గుడ్‌బై!" అని విసురుగా వచ్చేసింది ఉష.

ఆరోజే రూమ్ ఖాళీచేసి వెళ్లిపోయాడు కిరణ్.

◇ ◆ ◇

ఉషకి కిరణ్ రూమ్‌వైపు చూస్తుంటే అంతులేని బాధ కలుగుతోంది. ఎన్ని కలలు కన్నది తాను. కిరణ్ పెద్ద ఇంజనీర్ అయినట్టు తామిద్దరూ చిలకా గోరింకల్లా కాపురం చేస్తున్నట్టు.. తన కలలన్నీ కల్లలు చేసిన దుర్మార్గుడు కిరణ్.. ఎంత తెలివిగా మోసం చేశాడు. తనెంత అమాయకురాలు. అతని కబుర్లన్నీ నమ్మి ప్రేమలో పడిపోయింది. ఎంత ఈజీగా చెప్పాడు. వేరే పెళ్లి చేసుకోమని? ఎంత తేలిగ్గా తమ బంధాన్ని మర్చిపోయాడు.

మొదట్లో ఎంతో భరింపరాని బాధగా అనిపించినా ఉష రోజులు గడిచేకొద్దీ తన ప్రేమకథను నెమ్మదిగా మరచిపోనారంభించింది. ఉషకి పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో పెళ్లిచూపులకి హాజరుకావడంవంటి హడావిడిలో ఉషకసలు కిరణ్ గుర్తుకే రాడు.

వేసవి సెలవులకి ఉష కజిన్ విజయ వచ్చింది. ఆమె కాలేజీలో లెక్చరర్. వయసు ముప్పై. పెళ్లి చేసుకోనంటుంది. ఆమెను చూస్తే ప్రత్యేక గౌరవం ఉషకి. ఎప్పటినుండో తన ప్రేమకథను విజయకు చెప్పి తన సందేహాలను తీర్చుకోవాలనుకుంటోంది ఉష. అందుకే అడిగింది.

"అక్కయ్యా! నీతో కొంచెం మాట్లాడాలి. రామకృష్ణా బీచ్‌కి పోదాం!"

"సరే పద!" అంది విజయ. బీచ్‌లో కూర్చోగానే "నా పెళ్లిగురించి అడుగుతావా?" అంది.

## తప్పెవరిది?



మన డాక్టర్ల నిర్లక్ష్యానికి మరో చేదు ఉదాహరణ! సెప్టెంబర్ ఐదవ తేదీన, 94వ సంవత్సరం! బరంపురంలోని ఓ ఆసుపత్రిలో సునీల్ పట్నాయక్ అనే 12 సంవత్సరాల కుర్రాడ్ని చేర్చారు. కాసేపటికి ఆ కుర్రాడు చనిపోయినట్లు డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు ఏడుస్తూ ఆ కుర్రాడ్ని శ్మశానానికి తీసుకుని వెళ్లారు. చితికి నిప్పు అంటించబోతూ వుండగా ఆ కుర్రాడు లేచి కూర్చోవడంతో తల్లిదండ్రుల సంతోషానికి అవధులు లేవు. అదండీ... మన డాక్టర్ల ప్రతిభ!!

— జూపిటర్

''లేదులే! విన్నే అంత ప్రశ్న వేసే ధైర్యంలేదు. నా విషయం చెప్పి కొన్ని డౌట్స్ తీర్చుకోవాలని'' అని మొదలుపెట్టింది ఉష.

''అక్కయ్యా! యువతీయువకుల మధ్య ప్రేమంటే ఏమిటి?''

''ఆకర్షణ!'' చిన్నగా నవ్వుతూ అంది విజయ.

''అంతకుమించి ఏమీ వుండదంటావా?–''

''నూటికి తొంభై తొమ్మిది కేసుల్లో అంతే''

''అసలది ఎందుకేర్పడుతుందంటావ్?

''చాలా కారణాలుండవచ్చు. ఏదైనా ఆకర్షణకు సంబంధించిందే కావచ్చు. వారు ఒకరిచే ఒకరు అందం, చదువు, ఇతర టాలెంట్స్‌వల్ల ఆకర్షితులు కావచ్చును''

''నిజమైన ప్రేమలు వుండవంటావా?''

''చెప్పాగా వన్ పర్సెంట్ వుంటాయవి. వాళ్లు పైపైవి కాక మనసునుచూసి ప్రేమిస్తారు''

''మరి సినిమాల్లో ప్రేమగురించి ఎంతో ఉన్నతంగా, త్యాగభరితంగా చూపిస్తారు. మరి నువ్వేమో చాలా అరుదంటున్నావ్?''

''సినిమా నిర్మాతలు సామాజిక సమస్య అంటూ ఇలా వన్ పర్సెంట్‌గాళ్ల కథలే సినిమాలుగా తీస్తుంటారు. అవే హిట్ అవుతుంటాయి''

''నిజమైన ప్రేమికులు ఒకరినొకరు జీవితాంతం మరవరనీ వేరే పెళ్లికిష్టపడరనీ అంటారుకదా...'' అని ఆగింది ఉష.

''అవి రేర్ కేసెసమ్మా. అలా అవి పెళ్లిచేసుకోనివాళ్లందరూ భగ్న ప్రేమికుల మకోకు సుమా'' అంది నవ్వేస్తూ విజయ.

''నేనొక అబ్బాయిని ప్రేమించానక్కయ్యా! అది ఏరకంగా ప్రేమో నువ్వే చెప్పాలి. మొదట్లో అతనే నన్ను పలకరించాడు. ఇంజనీరింగ్ స్టూడెంట్. క్రమంగా మేం చాలా దగ్గరయ్యాం. ఒక్కరోజుకూడా ఒకర్నొకరు చూడకుండా వుండలేకపోయేవాళ్లం. అలాంటిది పెళ్లికి మా వాళ్లను ఒప్పిస్తానని పోయి తిరిగివచ్చి మా ఇంట్లో ఒప్పుకోలేదు. నువ్వు వేరే పెళ్లి చేసుకో, సారీ! అని ఎంతో ఈజీగా చెప్పేశాడక్కయ్యా!'' ఆవేశంగా చెప్పింది ఉష.

''అతను అన్నీ సవ్యంగా జరిగి అంటే తల్లీ, తండ్రీ ఒప్పుకుని వుంటే నిన్ను చేసుకునేవాడేమోకదా ఉషా?'' కూల్‌గా అంది విజయ.

''నాకోసం వాళ్లనెందుకు ఎదిరించకూడదు?'' కోపంగా అంది ఉష.

''కని పెంచిన తల్లిదండ్రుల్ని ఎదిరించైనా చేసుకోవాలనుకునేంతగా నిన్ను ప్రేమించలేదేమో!'' శాంతంగా అంది విజయ.

''మరి నేను లేకుండా బతకలేనన్నాడు?''

''అప్పుడలా అనిపించినా ఆ తర్వాత ఏం ఫరవాలేదనిపించవచ్చును''

''అంత వ్యక్తిత్వం లేనివాణ్ణి చేసుకోకపోవడమే మంచిది''

''నిన్ను పెళ్లాడి వుంటే వ్యక్తిత్వం వున్నవాడే అయ్యేవాడుకదా!''

''అయినా అంతటి మోసగాడు నాకొద్దులే''

''నిన్ను చేసుకుని వుంటే అతడు

మమ్మాటికీ మోసగాడు కాదుకదా!''

''ఇంకో అమ్మాయిని చేసుకునేటప్పుడు అతను నన్నుపోగుట్టుకున్నందుకు బాధపడడంటావా అక్కయ్యా!''

''ఎందుకు పడాలి? ఆ వచ్చే అమ్మాయిలో నిన్ను మించిన అర్హతలుండవచ్చునుకదా! ''

''ఒకవేళ లేకపోతే?''

''లేకపోయ్యినంతమాత్రాన ఎందుకు బాధపడతాడు. నీలో లేని మరో మంచి లక్షణం ఆమెలో వుండవచ్చునుకదా! సపోజ్ ఆ అమ్మాయికున్న లక్షలాస్తి నీకు లేదుకదా! సరే! అతని విషయం వదిలెయ్యి. నీ సంగతి చెప్పు. అప్పట్లో అతను లేకుండా జీవించలేనని అనుకున్నావ్‌కదా! మరి ఇప్పుడూ అలాగే అనుకుంటున్నావా?'' అడిగింది విజయ.

''లేదు. ఇతన్ని కాకపోతే మరొకతన్ని చేసుకుని సుఖపడతాను కానీ ఇతన్నే తల్చుకుంటూ జీవితం పాడుచేసుకుంటానా?''

''వేరే వ్యక్తిని వివాహమాడినప్పుడు నువ్వు అతన్ని తలచుకుని బాధపడవా?''

''పడను. ఎందుకు పడాలి? ఇంతటివాడు ఎవడూ లేడని బాధపడాలా?''

''ఆ వచ్చేవాడు. ఇతనికంటే గొప్పవాడు కాదనుకో''

''నువ్వే అన్నావ్‌గా! అతనిలో వున్న మరోగుణం చూసి ఆనందించవచ్చుని!'' చిరాగ్గా అంది ఉష.


''ఓ.కే ఓ.కే ఇప్పుడు అతనిమీద నీ అభిప్రాయం?''

''ఏం లేదు. మోసగాడు బ్రతకనేర్చినవాడు అంతే'' అంది ఉష.

''ఫోర్స్ అతనివైపునుండి వచ్చింది కనుక అతను మోసగాడయ్యాడు. అదే నీ తల్లిదండ్రులు నిన్ను వేరే పెళ్లికి ఒప్పించి వుంటే నువ్వు మోసగత్తెనయ్యేదానివేమో, ఆలోచించు''

''నేనట్లా చెయ్యను''

''ఒకవేళ పరిస్థితుల ప్రభావంవల్ల చేద్దువేమో''



"ఏమో?"

"అతనూ, అలాగే తప్పని పరిస్థితుల్లో ఇలా చేశాడేమో, అవి క్షమించి ఎప్పటిలా అతన్ని ప్రేమించవచ్చునుకదా!"

"నేను మరో పెళ్లి చేసుకుంటున్నాను. నువ్వూ చేసుకో అన్నవాణ్ణి ఇంకా నేనెందుకు ప్రేమించాలి?" కోపంగా అంది ఉష.

"పెళ్లి చేసుకునే ఉద్దేశంతోనే ప్రేమిస్తావా? ఆ ఆశయం నెరవేరదనుకున్నప్పుడు వెంటనే ప్రేమించడం మానేస్తావా?"

"పెళ్లాడే ఉద్దేశం లేనప్పుడు మరెందుకు ప్రేమించుకోవడం!"

ఉష ఆశ్చర్యానికి అంతులేదు. విజయ ఎటో చూస్తోంది. ఆమె మనసిక్కడలేదు.

"ఉషా! అతన్ని క్షమించి, అతని పరిస్థితులర్థంచేసుకుని నిస్వార్థంగా, పెళ్లికి అతీతంగా అతనికోసమే బ్రతుకుతూ అతన్ని ప్రేమిస్తూ వుండిపోలేవా?"

ఉష విజయవైపు విచిత్రంగా, పిచ్చిదాన్ని చూసినట్టు చూసింది.

"అతనింకో పెళ్లి చేసుకున్నా, నేను నా సుఖం విడిచి అతనికోసమే బ్రతుకుతూ, నా జీవితాన్ని త్యాగం చేయాలా? నీకేమైనా పిచ్చిపట్టిందా అక్కయ్యా! మతి వుండే మాట్లాడుతున్నావా?

విజయ ఏమీ మాట్లాడలేదు. చూపు మరల్చలేదు. ఎటో చూస్తోంది.

"ఏదో ఓ ఆరు నెలలు ప్రేమించిన పాపానికి జీవితంలో ఆనందాన్ని పాడుచేసుకుని భగ్న ప్రేమికురాలిలా గడపాలా? భలే సలహా ఇస్తున్నావక్కయ్యా! నా జీవితం నాది. నేనెందుకు నా సుఖాన్ని త్యాగం చేస్తాను? ఆ మాటకొస్తే నేనేం అతన్ని ప్రాణానికి ప్రాణంగా ప్రేమించలేదులే. ఏదో అతనిష్టపడ్డాడుకదా, ఇంజనీరవుతాడుకదా అని నేనూ ఇష్టపడ్డాను. అతన్ని పెళ్లిచేసుకుని సుఖపడొచ్చని ఆశించానుకానీ నా లైఫ్ స్పాయిల్ చేసుకునేందుక్కాదు"

విజయ సూటిగా చూసింది ఉషవైపు. 'నీ అసలు ప్రేమ ఇదా' అన్నట్టు. ఆ చూపుకు తలదించుకుంది ఉష. కొంతసేపు ఇద్దరూ మాట్లాడలేదు. తర్వాత ఉషే అంది.

"అక్కా! నువ్వన్నట్టుల మాది నిజమైన ప్రేమ కాదేమో! కేవలం ఆకర్షణేనేమో! ఏదైనా మనం భవిష్యత్తుగురించి కలలు కనడం తప్పుకాదుకదా! అలా అని తీరని కోరికలని తలచుకుని జీవితం పాడుచేసుకునే కంటే దొరికినదానితోనే తృప్తిపడి జీవితం ఆనందదాయకం చేసుకోవడం తెలివైన పని కాదా అక్కయ్యా నువ్వే చెప్పు" పిచ్చిగా తలూపింది విజయ. తర్వాత నెమ్మదిగా అంది.

"అవును ఉషా! నువ్వన్నది అక్షరాలా నిజం. నువ్వు చేస్తున్న పనే మంచిది. నేనేదో సరదాగా అన్నాను. నువ్వింటికెళ్లు ఉషా! నేను కొంతసేపుండి వస్తాను" ఉష వెళ్లిపోయింది.

విజయను ఆలోచనలు చుట్టుముట్టాయి. స్వగతంలా అనుకుంటోంది. మనసులు ఇచ్చి పుచ్చుకుని అవే శాశ్వతమనుకున్నాం. విశ్వానికి కొన్ని కారణాలవల్ల వేరే పెళ్లయినా అతన్నే మూగగా ఆరాధిస్తూ ఈ జన్మకి ఇలాగే వుండిపోవాలని నిర్ణయించుకున్నది తను. ఉష అన్నట్టు తను తెలివితక్కువగా జీవితం పాడుచేసుకుంటోందా? తన మనసు

కు న్యాయం చేస్తున్నాననుకుంటున్నది కానీ మోసం చేసుకోవడంలేదుకదా! ఈ జన్మకిక మరో వ్యక్తికి హృదయంలో స్థానమివ్వలేదు. ఎన్ని కష్టాలైనా భరిస్తుందిగాని!

ఎమ్మెస్సీ కలిసి చదివే రోజుల్లో విశ్వానికి మనసిచ్చి పుచ్చుకున్నది. నిరాటంకంగా పెళ్లి జరుగుతుందనుకున్నాం. ప్రశాంతంగా సాగుతున్న వాగులోనికి వరద గట్లు తెంచుకుని వచ్చినట్లుగా సాఫీగా సాగుతున్న తమ జీవనంలోకి పరిస్థితులు ఒక్కసారిగా విరుచుకుపడి ఉక్కిరిబిక్కిరి చేశాయి. తేరుకునేలోగా కాలం ముందుకు సాగిపోయింది. తమ బాటలు వేరయ్యాయి. విశ్వం మరో స్త్రీకి భర్తయ్యాడు. తమ మాత్రం విశ్వం ఎంత చెప్పినా తన మనసును వెనక్కి తీసుకుని మరో పురుషుడికివ్వడానికి అంగీకరించలేదు. అవివాహితగానే వుండాలని నిశ్చయించుకుంది.

అప్పుడప్పుడూ లెటర్లు రాస్తూ ఎప్పుడైనా మాసిపోతూ వుండే విశ్వాన్ని ఒక ఆప్తుడిగా, స్నేహితుడిగా భావిస్తుంది తప్ప అతడు తనని మోసం చేశాడని కానీ, తననిలా వదిలి తను మాత్రం సంసారజీవనం గడుపుతున్నాడనికానీ అనిపించదు. ఉష అన్నట్టు అతనికోసం తన జీవితాన్ని స్పాయిల్ చేసుకున్నాననికూడా అన్పించదేం? ఈ జన్మకిక మరో వ్యక్తికి జీవితంలో స్థానమివ్వలేదు. ఈ జీవితం ఇలా గడిచిపోవలసిందే అనుకుంటూ చిరునవ్వుతో ఈ సమస్యను ఎదుర్కొంటున్నది కానీ తనేమీ త్యాగం చేస్తున్నట్టు ఫీల్ కావడంలేదే! నిజానికి అతన్ని మరచిపోవడమే తనకు కష్టం. ఇలా బతకడమే సులభం.

విశ్వం పెళ్లిచేసుకున్నాడని తెలిసిన తన మనసు మూగవోయిన వీణలా అయిందేతప్ప ఉషలా రోషపడలేదు. అతన్ని భర్తగా పొందగలిగే అదృష్టం తనకు లేదు అనుకున్నది. తమని వేరుచేసిన పరిస్థితులేమిటని ఆలోచించిందికానీ అతనిమీద ద్వేషం కలిగలేదు. ఈనాటికీ విశ్వాన్ని ఒక ఆప్తుడిగా మిగుల్చుకున్నది తాను.

మరి ఉష, కిరణ్ లు తమలాగే ప్రేమించుకున్నారుకదా! వారి ఆలోచనలు వేరుగా ఉన్నాయేమిటీ? వాళ్లిద్దరూ తెలివైనవాళ్లు, తాము తెలివితక్కువవాళ్లమూనా? ఏమిటి తేడా? ఏమో! అంతుపట్టడంలేదు. పోనిద్దూ. అనుకుంటూ లేచి ముందుకు నడిచింది విజయ.

ఉషా, కిరణ్ ల ప్రేమ తను అన్నట్టు తొంభై తొమ్మిది శాతం ప్రేమికుల ప్రేమనీ, తమది ఒక్క శాతం ప్రేమికుల ప్రేమనీ, తమ ప్రేమకి తనే పరిపూర్ణత తెచ్చి పెట్టాననీ ఆమె సంస్కారం, ఆమె ఔన్నత్యాన్ని గుర్తించనీయక ఆమె స్వచ్ఛతను రెట్టింపు చేస్తోంది.